# "నాకు తట్టలేదు...."

(ఒక రేఖా చిత్రం)

ఎండ తీవ్రంగా వుంది. గట్టుమీద బట్టలు వదిలిపెట్టి గోచీ కట్టి కోనేటిలో దిగేను స్నానానికి. నీళ్లు చల్లగా హాయిగా వున్నాయి. చెరువులో తామర మొక్కలు రెక్కలు విప్పి చాల భాగం విస్తరించాయి. పువ్వులు తలలెత్తి సూర్యునివేపు చూస్తున్నాయి.

నాతోబాటు రెండు గేదెలుకూడా కోనేటిలో స్నానం చేస్తున్నాయి. వాటి శరీరాలు ఎండకు నిగనిగ లాడుతున్నాయి. కాని అవి నల్లగా వికారంగా వున్నట్టు నాకనిపించలేదు.

చెరువు గట్టుమీద పెద్ద రావిచెట్టుకింద పదేళ్ళ బక్క పలచటి కుర్రవాడు కూర్చున్నాడు. ఒకసారి చెరువువేపు తిరిగి తన గేదెలను రమ్మని ఒక కేకవేసి మళ్ళీ యథాప్రకారంగా కూర్చున్నాడు గేదెలు వాడిమాట వినలేదు. అవి వాడిమాట ఎందుకు వినలేదో నాకు తట్టలేదు.

కుర్రవాడు చెట్టుకు జారబడి నిద్రపోతున్నాడు. గేదెలను తోలుకెళ్ళకుండా వాడెందుకు నిద్రపోతున్నాడో నాకు తట్టలేదు.

కుర్రవాడి చెవి దగ్గర కందిరీగ గీపెట్టింది. చేత్తో కందిరీగను తోలుతున్నాడు. రావి చెట్టు ఆకులు రాలేయ్. ఆకులను తోలుతున్నాడు.

నా స్నానమయింది. అది నిజంగా స్నానమేనా? గేదెలు స్నానంచేసే నిలవ నీటిలో నేనూ స్నానం చేశానని నాకు తట్టలేదు.

కుర్రవాడు మళ్లీ గేదెలను రమ్మని పిలిచాడు. ఆ పిలుపుకు మళ్లీ గలగలమని ఆకులు రాలేయి. వాడి గొంతుక చాల నీరసంగా వుంది. వాడంత నీరసంగా ఎందుకున్నాడో, స్కూలు కెళ్లకుండా గేదెలనెందుకు తోలుతున్నాడో!

బొ. సూ.

○ ○ ○ ○ ○ ○

## స్వ విషయాలు అవీ, ఇవీ

### శ్రీ శివయ్య మృతికి సంతాపం

సుప్రసిద్ధ కవి, రాజకీయ నాయకుడు శ్రీ పులుపుల శివయ్య మరణానికి జూలై 25 సమావేశంలో సంతాపం ప్రకటింపబడింది.

### సహాయానికి విజ్ఞప్తి

'అభ్యుదయ' ప్రచురణ నిమిత్తం కాగితం రూపంలోనూ, చిన్నవీ, పెద్దవీ మొత్తాల రూపంలోనూ చాల చోట్లనుంచి సహాయం వచ్చింది. సభ్యులు కొంత మంది నెలనెలా విరాళాలు అందజేస్తున్నారు. వీరందరికీ కృతజ్ఞత. అయితే యిది చాలడం లేదు. పుటలు పెంచడానికి వీలుకాదు. ఇది దృష్టిలో పెట్టుకొని సహాయ పడవలసిందిగా విజ్ఞప్తి.

> **అరసం గోష్ఠి—**
>
> ఆగస్టు 29న సాయంత్రం 6 గంటలకు. విషయం 'ఆత్మ హననం త్యాగమా?' శ్రీ కాకరాల గోష్ఠి ప్రారంభిస్తారు. అందరికీ సుస్వాగతం.

### కన్నడ అభ్యుదయ రచయితలు

జూలై 20నజరిగిన కన్నడ అభ్యుదయ రచయితల, అభ్యుదయ భావుకుల సమావేశంలో <u>అరసం</u> ప్రధాన కార్యదర్శి శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి సంఘ లక్ష్యాలు, నిర్మాణ విషయాలు వివరించారు.

Krishnaveni Printers, Aryagowder Road, Extn., West Mambalam, Madras-33.